క్లుప్తంగా

నేటిసభకు తరలిరావాలి

నర్సంపేట : దేశాభివృద్ధికి అడుగులు వేస్తూ నేడు(బుధవారం) ఖమ్మంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అన్ని మండలాలు, గ్రామాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, క్లస్టర్ బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు.

సంతాపసభను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట : సహకార సంఘాల వ్యవస్థాపకుడు, మండల తొలి ఎంపీపీ అర్శనపెల్లి రాజేశ్వర్‌రావు సంతాప సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐ యూ మండల నాయకులు జన్ను రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 19న ముగ్దుంపురంలోని శ్రీరామ ధాన్య విత్తన పరస్పర సహాయ సహకారం సంఘం ఆవరణలో జరిగే రాజేశ్వర్‌రావు సంతాప సభకు ప్రజలు, నాయకులు, కళాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బహుమతుల అందజేత



గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లిలో వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం రాత్రి క్లబ్ ప్రతినిధులు బహుమతులను పంపిణీ చేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను క్లబ్ మహిళా ప్రతినిధి డాక్టర్ హరి రమాదేవి, అధ్యక్షుడు దీకొండ నర్సింహారావు అందించారు. క్లబ్ ప్రతినిధులు ఫీలా రాధిక, విశ్వనాధుల అర్పిత, రామగిరి కవిత, మామిడాల రాజ్యలక్ష్మి, గాయత్రి, అనంతుల కుమారస్వామి, ఎల్లరాజు, సర్పంచ్ ఆకుల స్రవంతి, రుద్రప్రసాద్, ఉప సర్పంచ్ వేణు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలిలోగల ప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరాయణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని మల్లె పూల దండలతో అలంకరించారు. ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, భక్తులు అభిషేక, అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భగవద్గీత ప్రచారం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాలలో మంగళవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవాసమితి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. భగవద్గీత అంశాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ఓంప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత జ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల, పద్మ, రావణాచారి, అక్షయ, త్రైతశ్రీ, శశిరేఖ, విక్రమ్, చారి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాలలో కష్టపడి పనిచేయాలని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శాయంపేట మండలంలో గల ప్రగతిసింగారంలోని ఆయన నివాసంలో మంగళవారం నడికూడ మండలం సర్వాపూర్, పులిగిల్ల, నర్సక్కపల్లి, వరికోల్, రాయపర్తి, నార్లాపూర్ గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో పార్టీ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో నడికూడ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తడి-పొడి విధానంలో వరిసాగు

- తక్కువ నీరు.. ఎక్కువ దిగుబడి
- హెక్టార్‌కు ఏడాదికి రూ.2వేల ప్రోత్సాహకం
- నేరుగా రైతు ఖాతాలో జమ



దుగ్గొండి : వరి నీటి పంట.. అధిక నీటి వసతి ఉంటే గాని పొలం పండదు. ఒక కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి రూ.3వేల నుంచి 5వేల లీటర్ల నీటిని వినియోగించాల్సి వస్తుంది.ఫలితంగా భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. పొలంలో నిరంతరం నీటి నిల్వల వల్ల మిథేన్ వాయువు అధికంగా ఉత్పత్తి అవుతుంది. దీంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. దీనినుంచి రక్షణ పొందడంతో పాటు తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేందుకు ప్రత్యామ్నాయ 0తడి–పొడి వరిసాగు(ఏడబ్ల్యూడీ) విధానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువస్తుంది.హెక్టార్ భూమిలో ఏడాదిలో రెండుసార్లు వరి పండించే రైతులకు ప్రభుత్వం రూ. 2వేలను ప్రోత్సాహకంగా రైతు ఖాతాలో జమచేస్తుంది. జిల్లా వ్యాప్తంగా అమలు చేయడానికి ప్రభుత్వం కోర్‌కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ సంస్థ, పోతన ఎడ్యుకేషనల్ సొసైటీలకు సంయుక్తంగా అప్పగించింది.

తడిపెట్టడం.. ఆరబెట్టడం..

వరిపంట నాటు వేసినప్పటినుంచి కోతకు 15 రోజుల ముందు వరకు అన్నదాతలు నీరు పెడుతూనే ఉంటారు. దీంతో భూమిలో నీరు అధికంగా నిలిచి మిథేన్ వాయువు ఎక్కువ మోతాదులో ఉత్పత్తి అవుతుంది. దీంతో పర్యావరణం దెబ్బతింటుంది. వరిపిలకలు తక్కువగా వస్తాయి. దీనిని అధిగమించడానికి పంటకు నీరు పెట్టడం మళ్లీ ఆరబెట్టడం ఇలా ఏడబ్ల్యూడీ విధానంతో సాగు చేయించనున్నారు. రైతులకు గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. నూతన విధానం ద్వారా వరి పంటలో సాధారణం కంటే 14శాతం అధిక దిగుబడి వస్తుంది. వేరు వ్యవస్థ భారీ అభివృద్ధి చెంది చేను పడిపోకుండా ఉండటంలో పాటు దోమ పోటు ఉధృతి చాలా తక్కువగా ఉంటుంది. 10 నుంచి 30శాతం వరకు నీరు, విద్యుత్ ఆదా అవుతుంది.

రూ.2వేల ప్రోత్సాహకం..

హెక్టార్ పొలంలో తడి–పొడి పద్ధతిలో వరిసాగు చేసే రైతులకు ప్రభుత్వం సీసీఎక్స్ సంస్థ నుంచి నేరుగా రైతుకు రూ.2వేలు జమ చేయనుంది. నీటి నిర్వహణ విధానాన్ని పరీక్షించడానికి నీటి గొట్టాలను ప్రభుత్వమే అందిస్తుంది. నూతనంగా ప్రభుత్వం తీసుకువచ్చిన విధానంతో రైతుకు పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి పెరగడం , ప్రోత్సాహకం రూపంలో అదనపు ఆదాయం వస్తుంది.

రైతులకు ప్రోత్సాహకం



వరంగల్ జిల్లాలో తడి–పొడి వరిసాగు పద్ధతి (ఏడబ్ల్యూడీ)ని సీసీఎక్స్, పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తుంది. 5 సంవత్సరాల పాటు పథకం అమలులో ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి సర్వే ప్రారంభిస్తాం. అర్హులైన అన్నీ వర్గాల రైతులకు రెండు పంటలు పండించే వారందరికి ప్రోత్సాహకాలు అందించే విధంగా చూస్తాం.

–గాడిపెల్లి దేవేందర్,
ఏడబ్ల్యూడీ జిల్లా కోఆర్డినేటర్

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజు

రాయపర్తి : మిరప పంటలో తామర పురుగు ఉధృతి, మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని తగ్గించుకునేందుకు రైతులు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని మామునూర్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జయరాంతండాలో మిరప, మొక్కజొన్న పంటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పురుగు ఉధృతిని తగ్గించుకునే విధానాన్ని రైతులకు వివరించారు. పంటల మొదటి దశలోనే లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం వల్ల పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు పురుగు ఉధృతిని గమనిస్తూ లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. మిరప పంటలో తామర పురుగులు, వైరస్ తెగుళ్ల వ్యాప్తి స్థాయని వీటి నివారణ కోసం నీలిరంగు, పసుపురంగు, జిగురు అట్టలను ఎకరాకు 35 చొప్పున అమర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు నీలి, పసుపు, జిగురు అట్టలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవస్వామి జాతర



దేవతా మూర్తులను ఊరేగింపునకు తీసుకెళ్తున్న సీఐ హథీరాం, సర్పంచ్ భాస్కర్

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి జాతర ముగిసింది. నాలుగు రోజులపాటు వైభవోపేతంగా జరిగిన జాతరలో సోమవారం రాత్రి ప్రధాన అర్చకులు ప్రత్యేక అభిషేకలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సీఐ హథీరాం, ఎస్సై తోట మహేందర్, సర్పంచ్ మాదారపు భాస్కర్, ఎంపీటీసీ పర్కాల లక్ష్మీ, రాజన్న, ఉప సర్పంచ్ బూరుగు రాజశేఖర్, వెంకటమల్లు, సూరయ్య, నర్సింహారావు, మెడబోయిన కుమార్, ఏకాంబరం, చీకటి పెద్ద వెంకటేశ్వర్లు, రాజు, అశోక్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక కృషితో నిధులు విడుదల చేయించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10.26 కోట్లు, బీటీ రెన్యూవల్ కోసం రూ.2.16 కోట్లు విడుదల కావడం జరిగిందన్నారు. వీటన్నింటికి టెండర్లు సైతం పూర్తి చేసి పనులు త్వరగా ప్రారంభిస్తామన్నారు. మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీ, తండాలకు వెళ్లే రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రామసహాయం ఉపేందర్‌రెడ్డి, బాలునాయక్, పులిగిళ్ల యాదగిరి, దేవేందర్‌రావు, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ దాసరి రమేష్, గుళ్లపల్లి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు తీవ్రపోటీ

నల్లబెల్లి : మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మండలానికి రెండు యూనిట్లను లబ్ధిదారులకు అందించేందుకు నిధులు కేటాయించారు. కాగా ఈ రుణాలకు మండలంలో ఇప్పటి వరకు 82 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ సభలు నిర్వహించి రెండు యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. రెండు యూనిట్స్‌కు అత్యధికంగా దరఖాస్తులు రావడంతో ఎవరిని అధికారులు ఎంపిక చేస్తారోనని దరఖాస్తుదారుల్లో ఆందోళన మొదలైయింది. కాగా మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ నన్నెసాహెబ్ మాట్లాడుతూ.. కనీసం 10 యూనిట్లు మంజూరు చేయాలని తెలిపారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిట్ల సంఖ్య పెంచాలన్నారు.

నూతన కార్యవర్గం



నర్సంపేట : పట్టణంలోని కస్తూర్బా మహిళా మండలి కార్యవర్గ సమావేశం మంగళవారం మండలి కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గుర్రపు అరుణ, ప్రధాన కార్యదర్శిగా నల్లా భారతి, కోశాధికారి గుడిపూడి అరుణ, సలహాదారులుగా పెండెం రాజేశ్వరి, నాంపెల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కొయ్యడి సరళ, గన్నోజు జయప్రద, పాలడుగు అన్నపూర్ణ, సహాయ కార్యదర్శులుగా వేములపల్లి ఉమాదేవి, ఉగ్గిడి శ్యామల, బత్తిని శిరీష, కార్యవర్గ సభ్యులుగా చింతల కళావతి, నల్లా తేజమ్మ, గన్నోజు కవితారాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపసర్పంచ్‌గా రాజన్న



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం ఉపసర్పంచ్‌గా ఇస్లావత్ రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంపీపీ సునీల్‌కుమార్ రాజ్ మంగళవారం తెలిపారు. గతంలో ఉపసర్పంచ్‌గా చందావత్ తిరుపతినాయక్ పై అవిశ్వాస తీర్మానం పాలకవర్గ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో తిరుపతినాయక్ కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో తీర్మానం ఆగిపోయింది. మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాసానికి గత నెలలో నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించగా అవిశ్వాసం నెగ్గింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల జ్యోతి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రహీం పాల్గొన్నారు.

బీజేపీలో యువతకు ప్రాధాన్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట / చెన్నారావుపేట : భారతీయ జనతా పార్టీలో యువతకు ప్రాధాన్యత ఉంటుందని నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన పలువురు యువకులు మంగళవారం రాణాప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం, వచ్చే ఎన్నికల కోసం యువకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ వీరు, హరిచంద్ర, ప్రసాద్, శ్రీను, బాదావత్ నాగరాజు తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



ఖానాపురం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్

చెన్నారావుపేట : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కూచన ప్రకాష్, డాక్టర్ సరోజ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో వైద్యాధికారులు, సిబ్బందికి రెండో విడత కంటి వెలుగుపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సుమన్, కంటి వెలుగు వైద్యాధికారులు ప్రసూన, సునిల్ చంద్ర, భరత్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు రామేల్, హెచ్‌వీ హేమలత, హెల్త్ అసిస్టెంట్లు శివాజీ, వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో కంటి వెలుగును విజయవంతం చేయాలని ముద్రించిన కరపత్రాలు, డోర్ స్టిక్కర్లను మంగళవారం సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ ఆవిష్కరించారు. ఈనెల 19 నుంచి ఉచితంగా నిర్వహించే శిబిరాలకు హాజరై కళ్లద్దాలు, మందులను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న మెపా నాయకులు



పర్వతగిరి: పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

నర్సంపేట : నర్సంపేటకు చెందిన ముదిరాజ్ నాయకుడు కాటబోయిన కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా, నర్సంపేట డివిజన్ మెపా నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. మెపా డివిజన్ అధ్యక్షుడు గోనెల భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి సాంబరాజు, దొంతరబోయిన నాగేష్, సోనబోయిన రవిచంద్ర, తాడెం దేవేందర్, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి..

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ శివారు చెరువు ముందు తండాకు చెందిన మాజీ సర్పంచ్ లూనావత్ బీలునాయక్ కుటుంబ సభ్యులను మంగళవారం ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మాజీ సర్పంచ్ బీలునాయక్ తండ్రి సోమ్లానాయక్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ రతన్‌రావు, మాజీ డైరెక్టర్ యుగంధర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ బానోత్ రవి, ఎంపీటీసీ మాడుగుల రాజు, పర్వతగిరి ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, ఎర్రబెల్లి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ పంతులు, టీఆర్ఎస్ నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, భిక్షపతి, పెద్ద మాధవరావు, చిన్న మాధవరావు, తదితరులు ఉన్నారు.

'సీఎం క్షమాపణ చెప్పాలి'

చెన్నారావుపేట : తెలంగాణ సమాజానికి సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1,200 మంది అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి నేడు బీఆర్ఎస్ అని జాతీయ పార్టీని ప్రకటించి తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాడని అన్నారు.యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, బయ్యారం కర్మాగారం, భద్రాచలంలో వరదల నష్టానికి రూ.1,000 కోట్లు ఎక్కడికి వెళ్లాయని విమర్శించారు. తెలంగాణ అమరవీరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి



పార్టీ కండువా కప్పుతున్న నాయకులు

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి అన్నారు. ఈ మేరకు 4, 15, 18, 20, డివిజన్ల కమిటీలను మంగళవారం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే నర్సంపేట నియోజకవర్గంలో పార్టీ కమిటీల పనితీరు ఆదర్శవంతంగా ఉండి దొంతి మాధవరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గాజుల రమేష్, పుల్లూరి రవి, ఓబీసీ పట్టణ ఉపాధ్యక్షులు ఓర్సు సాంబయ్య, ఓర్సు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా పార్టీ నుంచి బహిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రన్న

నర్సంపేట : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నుంచి నల్లబెల్లి మండలం లక్ష్మీతండాకు చెందిన లావుడ్యా రాజును బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రన్న ప్రకటించారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్, కొత్తపల్లి రవి, చిర్ర సూరి, మాడ అశోక్‌లతో కలిసి చంద్రన్న మాట్లాడారు. లావుడ్యా రాజు కొంత కాలంగా కమ్యూనిస్టు పార్టీ మౌళిక సూత్రాలకు విరుద్ధంగా, నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నాడన్నారు. కమ్యూనిస్టు విలువలకు తిలోదకాలిస్తూ ఆర్థిక అరాచకత్వం, అనైతిక వ్యవహారాలు, పార్టీ నిర్మాణ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడం, బ్లాక్ మెయిల్ చేయడం, భూ ఆక్రమణలు లాంటి తీవ్రమైన కార్యకలాపాలకు పాల్పడ్డ లావుడ్యా రాజును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. లావుడ్యా రాజుకు అనుచరుడిగా ఉంటున్న అదే గ్రామానికి చెందిన పరికి రత్నంకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. రాజు బాధితులు ధైర్యంగా ముందుకు వస్తే వారికి తమ పార్టీ అండగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు బి.నరసింహారావు, నర్సంపేట డివిజన్ నాయకులు అడ్డూరి రాజు, అలువాల నరేష్, కోడెం సారంగం, కందిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 21న రాజీనామా చేస్తే..
ఇప్పుడు బహిష్కరిస్తారా?: లావుడ్యా రాజు

నర్సంపేట : ప్రజాపంథా రివిజనిస్టు రాజకీయాలు నచ్చక డిసెంబర్ 21న పార్టీ జిల్లా కార్యదర్శికి రాజీనామా చేశానని లావుడ్యా రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'నేను ఉన్న కమిటీలో తనగురించి ఏమి మాట్లాడని వారు నేను రాజీనామా చేసిన తర్వాత మాట్లాడడం సిగ్గు చేటు' అని అన్నారు. కమిటీల మినిట్స్‌లు అన్ని తన వద్ద ఉన్నాయని, వాస్తవాలు ఏమిటో ప్రకటిస్తానన్నారు. తమను తాము సమర్థించుకోవడానికి అవాస్తవాలను ప్రకటిస్తున్నారని, వారికి దమ్ము ఉంటే తనపైన ఆరోపణలు చేసిన వారితో ప్రకటిస్తారా అని సవాల్ విసిరారు. తప్పుడు ప్రకటనలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నర్సంపేట రూరల్ : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజయ్యలు, గౌరవ సలహాదారులు గుంటి రాంచందర్ ఆవిష్కరించారు.

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

ఐనవోలు : బీజేపీ మతోన్మాదులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం సీపీఎం సమావేశం దీకొండ ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లింగయ్య మాట్లాడుతూ.. బీజేపీ దేశంలో అధికారంలోకి వచ్చిన తర్వాత లౌకిక విలువలు దెబ్బతింటున్నాయని వాపోయారు. క్రిస్టియన్, మైనార్టీ దళితులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వివిధ మతాచారాలు, సాంప్రదాయాలు దెబ్బతీసే విధంగా బీజేపీ కుట్రలు చేస్తోందని, ఈ కుట్రలను కమ్యూనిస్టు కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ సభ్యుడు ముల్కలగూడెం సర్పంచ్ బండి పర్వతాలు మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు లేవని, ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజా ప్రతినిధులు కృషిచేయడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గ్రామ కార్యదర్శి ఎన్నిక

సీపీఎం గ్రామ నూతన కార్యదర్శిగా కొంకాల నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా దీకొండ ఉప్పలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దొనికెన వెంకటేశ్వర్లు, జక్కుల నర్సయ్య, బొమ్మకంటి యాకయ్య, రాయపురం కొంరయ్య, కవితచవ్రజమ్మ, లెక్కల నర్సయ్య, శంకర్‌రెడ్డి, మోహన్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు నుంచి ఆటో నర్సంపేట వైపు వస్తుండగా బుధరావుపేటలో ఆరుగురు ప్రయాణికులతో ముగ్గురు చిన్నారులతో కలిసి నర్సంపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో ఖానాపురం గ్రామానికి చేరుకోగా మరో మహిళ ఆటోలో ఎక్కింది. పది మంది ప్రయాణికులతో నర్సంపేట వైపు వెళ్తుంది. ఇదే సమయంలో రాగంపేటకు చెందిన దిలీప్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో వచ్చి హనుమాన్ సెంటర్‌లో ఆటోను ఢీకొట్టారు. దీంతో ప్రయాణికులతో బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న ఖానాపురానికి చెందిన మచ్చిక పద్మకు కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. బుధరావుపేట నుంచి వస్తున్న మిగతా ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు ప్రయాణికులందరిని ఆటోలో నుంచి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన పద్మను నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.